ప్రజాశక్తి

గురువారం 14 నవంబర్ 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

దుర్గా బ్యాంక్ లైసెన్స్ రద్దు

- డిపాజిటర్లలో ఆందోళన
- నిలిచిపోయిన బ్యాంకింగ్ కార్యకలాపాలు
- రూ.5 లక్షలలోపు వారికే పూర్తి చెల్లింపులు
- లిక్విడేటర్ నియామకానికి ఆర్‌బిఐ ఉత్తర్వులు

వన్‌టౌన్‌లోని దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్; చిత్రంలో బ్యాంక్ ఇన్చార్జి సిఇఒ బి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పాతబస్తీలోని రాజా రంగయ్యప్పారావు వీధిలోని ది దుర్గా కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ లైసెన్స్‌ను రద్దుచేసి ఈనెల 12న నుంచి బ్యాంక్ సాధారణ కార్యకలాపాలను నిలువుదల చేస్తూ రిజర్వ్ బ్యాంక్ ఇచ్చిన ఆదేశాలతో ఆ బ్యాంక్ డిపాజిటర్లలో ఆందోళన నెలకొంది. దుర్గా బ్యాంక్ లైసెన్స్ రద్దు వార్తను తెలుసుకున్న పలువురు డిపాజిటర్లు బుధవారం బ్యాంక్ వద్దకు వచ్చి తమ డిపాజిట్ల పరిస్థితిని గురించి బ్యాంక్ సిబ్బందిని అడిగి ఆరా తీశారు. 1926లో దుర్గా బ్యాంక్‌ను స్థాపించారు. దశాబ్దకాలం వరకూ లాభాల బాటలో ఉన్న ఆ బ్యాంక్ ఆ తర్వాత క్రమేపీ నష్టాల్లో కూరుకుపోయింది. దీనికితోడు ఏ ఇతర సహకార బ్యాంకుల్లో లేనన్ని రాజకీయాలు ఈ బ్యాంక్ పాలకవర్గాల్లో ఉండడమే కూడా నష్టాలకు కారణంగా చెబుతున్నారు. దుర్గా బ్యాంక్ ఆధ్వర్యంలో నగరంలో ముఖ్యంగా వన్‌టౌన్ కొండ ప్రాంత పేదలకు ఇంటి రుణాలు ఇచ్చేవారు. ఆ రుణాలు తిరిగి ఎక్కువ శాతం వసూలు కాకపోవటం కూడా శాపంగా పరిణమించింది. గత కొన్నేళ్లుగా దుర్గాబ్యాంక్ తమ డిపాజిటర్లకు కాలపరిమితి ముగిసినా డిపాజిట్లను తిరిగి చెల్లించడంలో విఫలమవుతూ వస్తోంది. దీంతో డిపాజిటర్లు అనేక దఫాలుగా బ్యాంక్ వద్ద నిరసనలకు దిగిన విషయం విధితమే. పలుమార్లు డిపాజిటర్లు రోడ్డెక్కి ధర్నాలు సైతం చేశారు. తమ డబ్బులు ఎప్పుడు తిరిగి ఇస్తారో మీమాంసతో పలువురు డిపాజిటర్లు బ్యాంక్‌కు రావడం, నిరాశతో తిరిగివెళ్లడం జరిగేది. ఈ క్రమంలో ఇక బ్యాంక్ కొనసాగే పరిస్థితులు లేవన్న అభిప్రాయంతో రిజర్వ్ బ్యాంక్ వారు దుర్గాబ్యాంక్ లైసెన్స్‌ను రద్దు చేశారు. బ్యాంక్‌నకు లిక్విడేటర్‌ను నియమించాలని కోరుతూ కో- ఆపరేటివ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. కాగా, దుర్గాబ్యాంక్ ప్రస్తుత పరిస్థితిపై బ్యాంక్ ఇన్చార్జి సిఇఒ బి.శ్రీనివాసరావును ప్రజాశక్తి కలిసి వివరణ కోరగా బ్యాంక్ డిపాజిటర్లకు రూ.50 కోట్ల మేర చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే బ్యాంక్‌కు రుణగ్రహీతల నుంచి ముఖ్యంగా ఇళ్ల రుణాలు సుమారు రూ.250 కోట్లకుపైగానే రావాల్సి ఉందన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆదేశం మేరకు రెండు రోజుల్లో దుర్గా బ్యాంక్‌కు లిక్విడేటర్ వస్తారని తెలిపారు. అనంతరం రూ.5 లక్షలలోపు డిపాజిటర్లకు డిపాజిట్ల డబ్బు తిరిగి ఇస్తామని (మిగతా 2లో)

నేడు కలెక్టరేట్ వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : అధిక ధరలను అరికట్టాలని, నిరుద్యోగ్యాన్ని నివారించాలని, మహిళలు, పిల్లలపై దాడులు, అత్యాచారాలను అరికట్టాలని, వరద బాధితులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం నగరంలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నా జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తెలిపారు. ఈ ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.బాబూరావు పాల్గొంటారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనల్లో భాగంగా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నాలో ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

భూ కబ్జా, స్థల యజమాని హత్యయత్నం కేసులో

వైసిపి నేత గౌతంరెడ్డిపై కేసు నమోదు

వార్త మెయిన్‌లో

- సుపారీ గ్యాంగ్‌లో నలుగురు అరెస్టు

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఫరూక్

భిన్నత్వంలో ఏకత్వంతో ముందుకు సాగాలి : మంత్రి ఫరూక్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కుల మతాలకతీతంగా, జాతి వైషమ్యాలను పక్కనపెట్టి ప్రతి ఒక్కరూ ముందుకు సాగినప్పుడే శాంతి సౌభ్రాతృత్వంతో కూడిన సమాజం ఆవిష్కృతమవుతుందని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం విజయవాడలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భిన్నత్వంలో ఏకత్వం సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథులుగా శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడారు. కుల మతాలను, వర్గవైషమ్యాలను రెచ్చగొట్టి కొందరు తమ స్వార్థం కోసం కుట్రలు పన్నేవారు ఉన్నారని, అలాంటి వారిని పట్టించుకోకుండా కుల మతాలకతీతంగా మిత్ర బంధంతో, సోదర భావంతో ప్రతి ఒక్కరూ నడుచుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తనకు బైపాస్ సర్జరీ జరిగినప్పుడు నంద్యాలలో గురుమూర్తి అనే ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన తన చిన్ననాటి మిత్రుడు రక్తదానం చేశాడని ఫరూక్ గుర్తు చేసుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వంలా కుల మత జాతి బేధాలను పక్కన పెట్టాలని, మనమంతా మనుషులం అని, ఒకే రక్తమని మంత్రి ఫరూక్ ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు మాజీ ఎమ్మెల్సీ టిడి జనార్దన్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫరూక్ షుబ్లీ తదితరులు హాజరయ్యారు.

మళ్లీ తెరపైకి అవినీతి భాగోతం

- భారీ వర్షాల బాధిత రైతుల జాబితాలో అవకతవకలు ?
- బాధిత రైతులు గగ్గోలు

ప్రజాశక్తి - పెడన : దేశానికి వెన్నెముకగా ఉన్న రైతన్నను సంబంధించిన నిధులను సంబంధిత శాఖాధికారులు దారి మళ్లించడంపై తీవ్రస్థాయిలో చర్చ సాగుతోంది. మిచౌంగ్ తుపాను బాధిత రైతుల జాబిత రూపకల్పనలో అవకతవకలకు పాల్పడిన పెడన మండలాధికారితోపాటు గ్రామస్థాయి సిబ్బందిని నాలుగు నెలల క్రితమే సస్పెండ్ చేసినా ఇప్పుడు పనిచేస్తున్న సిబ్బంది కూడా అదేబాటలో పయనిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పెడన నియోజకవర్గంలోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల్లో నాలుగు నెలల క్రితం కురిసిన అకాల వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయారు. నియోజకవర్గంలో 33 శాతం నుండి 37 శాతానికిపైగా వరి పంటకి నష్టం వాటిల్లింది. 11,840 ఎకరాల్లో 2964 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టంపై సర్వే చేసి బాధిత రైతుల పేర్లు నమోదు చేసి జాబితాను అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇదే అదనుగా భావించిన గూడూరు మండలం కప్పలదొడ్డి, పెడన మండలం సింగరాయపాలెం, బల్లిపర్రు, మడక పంచాయతీలతోపాటు బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల్లో నకిలీ రైతుల పేర్లతో జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతుల పేర్లకు బదులుగా అనధికారికంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్న కొంత మంది పేర్లను ఈ జాబితాలో చేర్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కప్పలదొడ్డి, సింగరాయపాలెం, కట్లపల్లి, బల్లిపర్రు, మడక గ్రామాల్లోని రైతులు తమకు నష్టపరిహారం రాలేదని, ప్రభుత్వానికి పంపిన జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవోనని వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సంబంధిత వ్యవసాయ శాఖాధికారులను కలిసి వివరాలు చెప్పాలని కోరుతున్నారు. అయితే గూడూరు శాఖాధికారి తాను ఇటీవలే బదిలీపై వచ్చానని చెబుతున్నారు. పెడన మండల ఏవో స్పందిస్తూ... తాను ఇన్చార్జినేనని, తన వద్ద పూర్తి వివరాలు ఉండవని అంటున్నారు. దీంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా, గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన మిచౌంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతుల జాబితా రూపకల్పనలో తీవ్ర అవకతవకలు చోటుచేసుకోవడంతో పలువురు అధికారులపై వేటుపడింది. ప్రభుత్వానికి అందించిన నివేదికలో అప్పటి పెడన మండల వ్యవసాయ అధికారి, పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు (విఎఎలు) కలిసి బినామీ పేర్లతో ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్లు సృష్టించి ప్రభుత్వానికి నివేదిక పంపారు. పెడన పట్టణంతోపాటు మండలంలోని సింగరాయపాలెం, బల్లిపర్రు, కట్లపల్లి, మడక పంచాయతీల్లో మొత్తం 5.100 హెక్టార్లలో వరి పంట, 49 హెక్టార్లలో వేరుశెనగ పంట దెబ్బతిని 2,400 మందికిపైగా రైతులకు నష్టం వాటిల్లినట్లు నివేదికలో పేర్కొన్నారు. దీంతో అప్పటి వైసిపి ప్రభుత్వం ఎకరానికి రూ.6,800 చొప్పున నష్టపరిహారం విడుదల చేసింది. అయితే బాధిత రైతుల జాబితాలో కొంతమంది బినామీలు ఉన్న విషయం బయటకు పొక్కింది. దీంతో నష్టపోయిన (మిగతా 2లో)

మండల నూతన కమిటీతో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, కోట కళ్యాణ్

సిపిఎం పెనుగంచిప్రోలు మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గురవయ్య ఎన్నిక

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : సిపిఎం పెనుగంచిప్రోలు మండల ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా వల్లబుదాసు గురవయ్య ఎన్నికయ్యారు. ఏడుగురితో మండల కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సిపిఎం మండల ఐదో మహాసభ పార్టీ నాయకులు పిడిమర్తి బాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై పెరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా జిల్లావ్యాప్తంగా ప్రజాపోరు సాగుతోందన్నారు. ఇటీవల సంభవించిన కృష్ణా, బుడమేరు వరద బాధితులను ఆదుకోవాలని, కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేవని, ఆదాయం, ఉపాధి మాత్రం లేకుండా పోతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలని, రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువతకు నిరాశే మిగిలిందని, గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించలేదని,. గ్రూప్-1, గ్రూపు-2 నోటిఫికేషన్లు అగమ్యగోచరంగా ఉన్నాయని, దీంతో యువత అయోమయంలో ఉందని పేర్కొన్నారు. ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయని విమర్శించారు. మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కళ్యాణ్ పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో కేంద్రంపై పోరాటం

సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి పి.పద్మ

ప్రజాశక్తి - విజయవాడ : తెలంగాణ సాయుధ పోరాటం మొదలుకొని నక్సల్ బరి, శ్రీకాకుళం, గోదావరి లోయ విప్లవ పోరాటాలలో వేలాది మంది నాయకులు, కార్యకర్తలు అమరులయ్యారని, వారందరి స్ఫూర్తిగా కేంద్రంలోని బిజెపి ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఐ ఎమ్ఎల్ న్యూడెమోక్రసీ విజయవాడ నగర కార్యదర్శి పి. పద్మ అన్నారు. న్యూడెమోక్రసీ పార్టీ పిలుపు మేరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బుధవారం క్రీస్తురాజ పురంలోని ఐ.ఎఫ్.టీ.యూ కార్యాలయంలో జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో ఆమె మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం సాగిన విప్లవ పోరాటాలలో జీవితాంతం పోరాడి ఎందరో అమరులయ్యారని గుర్తుచేశారు. వారి ఆశయాల బాటలో ముందుకు నడిచినపుడే వారికి మనం అందించే నిజమైన నివాళులన్నారు. భూసంస్కరణల అమలును ప్రక్కన పెట్టిన ప్రభుత్వాలు వేలాది ఎకరాల భూములను లాండ్ బ్యాంక్ పేరుతో సమీకరిస్తూ ఉపాధి కల్పన పేరుతో కార్పొరేట్ కంపెనీలకు దుర్మార్గంగా కట్టబెడుతున్నారని గుర్తు చేశారు. దున్నుకునేందుకు భూమి కావాలని పోరాడుతున్న ప్రజలపై, సామాజిక న్యాయం కోరుతున్న దళితులపై, అటవీ హక్కులకై ఉద్యమిస్తున్న ఆదివాసీలపై, కార్పొరేటీకరిస్తున్న పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను రక్షించాలని కోరుతున్న రైతులపై, కార్మికులపై ఆర్ఎస్ఎస్ బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా ఫాసిస్ట్ దాడులు చేస్తున్నదని విమర్శించారు. ప్రజలలో చీలిక తెచ్చేందుకు మతం పేరుతో విద్వేషాలు రగిలిస్తూ, అధికారాన్ని కాపాడుకునేందుకు హిందుత్వ వాదాన్ని రెచ్చగొడుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల మధ్య సామరస్యతను కాపాడుకునేందుకు, ప్రభుత్వ నిర్బంధ విధానాలకు వ్యతిరేకంగా అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని పద్మ పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ నాయకులు కె.పోలారి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఐఎఫ్‌టియు నాయకులు ముని శంకర్, దాది శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. అమరవీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

రాంపిళ్ల నరసాయమ్మను సత్కరిస్తున్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ; ముఖ్యమంత్రి చంద్రబాబు (పాతచిత్రాలు); మధ్యలో నరసాయమ్మ పాతచిత్రం

స్వాతంత్ర్య సమరయోధురాలు నరసాయమ్మకు నివాళి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ (95) బుధవారం కన్నుమూశారు. వయోభారం కారణంగా పాలఫ్యాక్టరీ సమీపంలోని తన స్వగృహంలో ఆమె మరణించారు. ఆమె భర్త రాంపిళ్ళ సూర్యనారాయణ కూడా ప్రముఖ స్వాతంత్ర సమరయోధులే. ఆయన 15 ఏళ్ల క్రితమే చనిపోయారు. నరసాయమ్మకు ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు హనుమత్ పీఠం పీఠాధిపతి శ్రీ శ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ. రెండో కుమారుడు రాంపిళ్ల జయప్రకాష్ సయ్యద్ అప్పలస్వామి కళాశాల నిర్వహిస్తూ, స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. మూడో కుమారుడు గౌరీ శివశంకర్ కొత్తపేటలోని ప్రముఖ దేవాలయమైన పంచముఖ ఆంజనేయ స్వామి వంశపారంపర్య ధర్మకర్తగా ఉన్నారు. కుమార్తె తమ్మిన గౌరీ బాయి వ్యాపార రంగంలో ఉన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో సాయుధ పోరాటం ద్వారా బ్రిటీష్ పాలకులను ఎదుర్కోవాలనే లక్ష్యంతో ఆమె... తన భర్త సర్దార్ రాంపిళ్ల సూర్యనారాయణతో కలిసి నగరంలోని పాల ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా ఉన్న కొండపై బాంబులు తయారు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన బ్రిటీష్ ప్రభుత్వం నరసాయమ్మ - సూర్యనారాయణ దంపతులపై కుట్ర కేసు పెట్టి అరెస్టు చేసింది. కొన్ని నెలలపాటు బ్రిటిష్ వారు ఆమెను జైలులో నిర్బంధించారు. జైలులో ఉన్న సమయంలో ఆమెకు రాంపిళ్ళ జయప్రకాష్ జన్మించారు. ఆ తర్వాత దేశాభ్యున్నతికి గాంధీ మార్గమే ఉత్తమమని తలంచి గాంధీ దేవాలయాన్ని స్థాపించారు. గాంధీ దీక్షలను ప్రచారం చేశారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ సలహా మండలిలో నరసాయమ్మకు స్థానం కల్పించారు. దీంతో ఆమె స్వాతంత్ర్య సమరయోధుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అనేక జాతీయ కార్యక్రమాల్లో పాల్గొని తన ప్రసంగాల ద్వారా జాతిని ఉత్తేజితం చేశారు. తన మామ సయ్యద్ రాంపిళ్ల అప్పలస్వామి నెలకొల్పిన సయ్యద్ అప్పలస్వామి కళాశాల అభివృద్ధికి కృషి చేశారు. మాజీ రాష్ట్రపతులు ప్రణబ్ ముఖర్జీ, రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా సత్కారాలను అందుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పలు సందర్భాల్లో ఆమెను సముచిత రీతిన సత్కరించారు. నరసాయమ్మ మతి వార్త తెలియంగానే పలువురు ప్రముఖులు పాల ఫ్యాక్టరీ వద్ద ఉన్న ఆమె స్వగహానికి తరలివచ్చి నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆమె మృతికి సంతాపం తెలిపారు. నరసాయమ్మ అంత్యక్రియలు గురువారం ఉదయం జరుగుతాయి.

గుణదల లూర్దుమాత ఉత్సవాలకు ఏర్పాట్లు

బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 9, 10, 11వ తేదీలలో మూడు రోజుల పాటు జరిగే గుణదల (లూర్దు) మాత 101వ మహోత్సవాలకు ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్ధం చేయాలని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఉత్సవ కమిటీలకు సూచించారు. గుణదల (లూరు) మాత పుణ్యక్షేత్రం ప్రాంగణంలోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఉదయం జరిగిన గుణదల మాత 101వ మహోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ గత ఫిబ్రవరిలో జరిగిన గుణదల మాత శతాబ్ది (100) మహోత్సవాలను అంగరంగ వైభవంగా విజయవంతంగా నిర్వహించామని, 2025 ఫిబ్రవరి 9, 10, 11 తేదీలలో జరిగే తిరునాళ్లను కూడా వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుండి ఏర్పాట్లు చేయాలని అన్నారు. 101వ జూబిలీ ఉత్సవాల సందర్భంగా విజయవాడ కేథలిక్ డయోసిస్ స్థాయిలోని అన్ని విచారణలలో ఉత్సవాలకు భక్తులను సంసిద్ధులను చేస్తామని తెలిపారు. ఫిబ్రవరిలో జరిగే మహోత్సవాలకు భక్తుల రద్దీ దష్టిలో ఉంచుకొని తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. విజయవాడ కతోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ 2025 జనవరి 31 నుండి ఫిబ్రవరి 8వ తేది వరకు 9 రోజుల పాటు గుణదల కొండపై జరిగే నవదిన ప్రార్థనలలో విజయవాడ మేత్రాసనంలోని అన్ని విచారణల నుండి గహస్థ క్రైస్తవులు విరివిగా పాల్గొని నవదిన ప్రార్థనలు విజయవంతం చేయాలని అన్నారు. గుణదల మాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలయం జయరాజు మాట్లాడుతూ దేశంలో రెండో అతి పెద్ద కతోలిక పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్, ఫాదర్ వల్లె జోజిబాబు, ఫాదర్ పసల తోమస్, ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప, ఫాదర్ దామాల విజయకుమార్, నువ్వుల విజయరాజ్, సిస్టర్స్, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎల్‌ను సందర్శించిన డిఫెన్స్ కమిటీ

హాజరైన ఎంపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ : పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఆన్ డిఫెన్స్ స్టడీ టూర్‌లో భాగంగా ఆ కమిటీ చైర్మన్ రాధ మోహన్ సింగ్, కమిటీ సభ్యులైన విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు బుధవారం హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ (డిఆర్‌డిఎల్)ను సందర్శించారు. డిఆర్‌డిఎల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కమిటీ చైర్మన్, సభ్యులను డిఆర్‌డిఎల్ అధికారులు శాలువాతో సత్కరించారు.

చంద్రబాబును కలిసిన ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

ప్రజాశక్తి- నందిగామ : శాసనసభ విప్‌గా నియమితులైన నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. విప్‌గా నియమించిన సిఎంకు ఆమె కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నకు, సిఎం చంద్రబాబు నాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

కోర్టు ప్రకటన

In the Court of the 14th Addl. District family Court and Session judge, At Vijayawada

F.C.O.P No: 863 /2023

Between:
Pinniboyana(Masimukku) Kanaka Durga W/o Pinnniboyana Nanda Gopal D/o Masimukku Bhiksham Raju, Hindu aged 28years, R/o D.No:2-47`, Indupalli Village, Unguturu Mandal, Krishna dt.
........Petitioner

And

Pinniboyana Nanda Gopal, S/o Seshagiri Rao R/o D.No: 47-3-38, Near Mary Matha Church.Gunadala, Vijayawada,N.T.R district
........Respondent

పై కోర్టులో పై నెంబరు ఎఫ్.సి.ఒ.పి నెం:863/2023, 14 వ ఫ్యామిలి కోర్టు అండ్ సెస్షన్స్ జడ్జి వారి జిల్లా కోర్టు నందు రెస్పాండెంట్ అయిన మీరు పై కోర్టులో హాజరై మీ వాదనలు వినిపించు కొనుటకు ది. 06-12-2024 నకు వాయిదా వేసినారు. కావున సదరు తేదిన ఉదయం 10-30 ని॥లకు మీరు గాని, మీ తరుపున న్యాయవాది గారు గాని, పై కోర్టు లో హాజరై తమకు గల అభ్యంతరాలు తెలుపుకొన గలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానం జరుగునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది

ఇట్లు :-

Pinniboyana(Masimukku) Kanaka Durga (Petitioner)
W/o Pinaboyana Nanda Gopal D/o Masimukku Bhiksham Raju, R/o D.No:2-47`, Indupalli Village, Unguturu Mandal, Krishna dt.

మొదటిపేజీ తరువాయి

దుర్గా బ్యాంక్ లైసెన్స్ రద్దు

తెలిపారు. ఇన్సూరెన్సు రక్షణ ఉన్నందున వారికి డిపాజిట్లు వస్తాయని తెలిపారు. 95.8 శాతం డిపాజిటర్లు రూ.5 లక్షలలోపు వారేనని, వారికి పూర్తి మొత్తం చెల్లిస్తామని ఆర్‌బిఐ అధికారులు తెలిపారు. ఏదిఏమైనా 98 ఏళ్లపాటు ఓ వెలుగు వెలిగిన దుర్గా బ్యాంక్ లైసెన్స్ రద్దు కావటంపై పలువురు ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

బ్యాంక్ వద్ద పోలీసు బందోబస్తు

బ్యాంక్ వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు దుర్గా బ్యాంక్ లైసెన్స్ రద్దుతో అందులో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి కూడా అగమ్య గోచరంగా తయారైంది. ప్రస్తుతం శాశ్వత ఉద్యోగులు 15 మంది, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐదుగురు ఉన్నారు.

అవినీతి ఆరోపణలపై పలు కేసులు

దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సిబ్బందిపై గత పదేళ్లుగా ఎన్నో అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. వీటికి సంబంధించి అనేక కేసులు నమోదవుతూ వస్తున్నాయి. విచారణ జరిపిన ఆర్‌బిఐ ఉన్నతాధికారులు బ్యాంకుపై పలు ఆంక్షలు విధించారు. డిపాజిటర్లకు రుణాలు చెల్లింపులో కూడా ఇబ్బందులకు గురిచేశారు. రూ.1.50 లక్షల వరకే విత్ డ్రా చేసుకోవాలని ఆంక్షలు విధించారు. ఈ విషయంపై డిపాజిట్‌దారులు ఆందోళనలు కూడా చేశారు. దుర్గా బ్యాంక్ ఖాతాదారులకు, డిపాజిట్‌దారులకు న్యాయం చేసే ఉద్దేశంతో బెంగుళూరు నుంచి వచ్చిన ఆర్‌బిఐ అధికారులు బ్యాంకులో తనిఖీలు చేసి లైసెన్సు రద్దు చేశారు.

మళ్లీ తెరపైకి అవినీతి భాగోతం

వాస్తవ బాధిత రైతులు...అవినీతికి పాల్పడిన సదరు అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పెడన పట్టణ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. స్పందించిన వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు విచారించి సుమారు రూ.11 లక్షల వరకు బినామీ రైతుల అకౌంట్లో ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో పెడన అర్బన్, బల్లిపర్రు విఎఎలను ఈ ఏడాది జూన్ 10న అధికారులు సస్పెండ్ చేశారు. ఆ తర్వాత జూలై 19న పెడన మండల ఎఒ శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు కూడా ఇదే గ్రామాల్లోని ప్రస్తుత సిబ్బంది, అధికారుల తీరు కూడా అలాగే ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై ఇన్చార్జి ఎడి హారికను వివరణ కోరగా, పంట నష్టపోయిన రైతుల వివరాలను ఆయా సచివాలయాల డిజిటల్ బోర్డుల్లో ఉంచాలని ఆదేశించినట్లు తెలిపారు. లేనిపక్షంలో సంబంధించిన సిబ్బందిపై విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేటి ధర్నాను జయప్రదం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సిపిఎం మచిలీపట్నం కమిటీ ఆధ్వర్యంలో శివగంగ, కాలేఖాన్ పేట, అమృతపురం, సర్కిల్ పేట, రాజుపేట కరెంట్ కాలనీల్లో బుధవారం సిపిఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర

పెనమలూరులో...

సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు టి.చంద్రపాల్, సిహెచ్ జయ రావు, ఎండి యూనస్, ఈడే రామారావు తదితరులు పాల్గొన్నారు. **కోడూరు:** కోడూరు మండల కేంద్రంలో జరిగే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఎం విశ్వనాథపల్లి గ్రామ శాఖ ఆధ్వర్యంలో విశ్వనాథపల్లి ప్రధాన సెంటర్లో, ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొప్పనాతి తాతయ్య, తోట శ్రీనివాసరావు, కొండవీటి వెంకట రామయ్య, గుర్రం నాగేశ్వరావు, పుట్టి నాంచార్లు తదితరులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** మండలంలోని అంగలూరు, చంద్రాల గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం

కోడూరులో...

మండల బాధ్యులు బివి శ్రీనివాసరావు, మదిరి నాగరాజు, ఏరికాపాటి ఫ్రాన్సిస్, కాటి భాస్కరరావు, కె.నాగరాజు, సాలి శ్రీను,కె.బాబూరావు తదితరులు పాల్గొన్నారు. **పెనమలూరు:** తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ తాడిగడప సెంటర్లో, కార్మిక నగర్-2 కట్టమీద ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, ఎస్కే మస్తాన్ వలి, పి.లక్ష్మీనారాయణ, వి.సోమశేఖర్, పుసులూరి పాతాళ లక్ష్మి, ఐద్వా మండల కార్యదర్శి తరిగొప్పల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు నీరివ్వండి

సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పెడన నియోజకవర్గ పరిధిలోని బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాల పరిధిలో దాళ్వా సాగుకు నీరివ్వాలని సిపియం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలోని భూములన్నీ సముద్రతీరం కావడంతో చౌడుబారి వున్నాయని అందువలన రెండవ పంటగా మినుము పండటం లేదని, భూముల స్వభావంతో పాటుగా అకాల వర్షాలతో మొదటి పంట దిగుబడులు కూడా తక్కువగా అవుతున్నాయని, దీనితో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అందుకే గతంలో రెండవ పంటగా దాళ్వా వరి సాగు చేశారని, గత 3 సంవత్సరాల నుండి ఈ ప్రాంత రైతాంగం దాళ్వా సాగుకు నీరివ్వాలని కోరుతున్నా ప్రాజెక్టులలో తగినంత నీరు నిల్వ లేదని, ఇంకేవో కారణాలు చెప్పి ఇవ్వలేదన్నారు. ఈ సంవత్సరం ప్రాజెక్టులలో సమృద్ధిగా నీరు ఉన్నందున దాళ్వా సాగుకు నీరివ్వాలని సిపియం కృష్ణాజిల్లా కమిటీ కోరుతుందన్నారు. ఈ ప్రాంతంలో వరి కోతలు మొదలయ్యాయని, అందుకే రెండవ పంట గురించి స్పష్టత లేక రైతాంగం గత కొద్ది రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తుందన్నారు. అయినా అధికార్లు, ప్రజా ప్రతినిధులు స్పందించక పోవడం గర్హనీయం అని వెంటనే నిర్ణయించి దాళ్వా సాగుకు నీరివ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

చిరుద్యోగులపై ప్రతాపం తగదు : సిఐటియు

ప్రజాశక్తి-గుడివాడ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరుద్యోగులపై నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న విధానాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరులతో మాట్లాడుతూ గుడివాడ రూరల్ మండలం పర్నాస గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలుగా పసలాది సునీత, ఆయాగా సరిహద్దు ఝాన్సీరాణిలు పని చేస్తున్నారన్నారు. వీరిని మానేయాలని కూటమి నాయకులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మారినప్పుడల్లా చిరుద్యోగుల మీద ప్రతాపం చూపించడం సరైన పద్ధతి కాదన్నారు. కూటమి నాయకులు చిరుద్యోగులపై తెస్తున్న ఒత్తిడిని తగ్గించకపోతే తర్వాత జరిగే పరిణామాలకు టిడిపి నాయకులే కారణం అవుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గన్నవరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను గన్నవరం జడ్పీటీసీ ఎలిజబెత్ రాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని ప్రధానంగా విద్యార్థులు ఉపయోగించుకునే విధంగా ఉపాధ్యాయులు గ్రంథాలయం సిబ్బంది, మేధావులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తపట్నం లైబ్రరియన్ కృపానందం, ముస్తాబాద లైబ్రరియన్ జ్యోతి పాల్గొన్నారు.

గ్రీన్ గుడివాడపై దృష్టి సారించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుడివాడ : గ్రీన్ గుడివాడపై స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టి సారించి ప్రమాదాలు జరగకుండా చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి సూచించారు. మంగళవారం అర్ధరాత్రి ప్రమాదానికి మరణించిన మోదుమూడి రంగారావు(45) కుటుంబ సభ్యులను సిపిఎం నాయకులు బుధవారం గుడివాడ ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ గుడివాడ బంటుమిల్లి రోడ్‌లో గుడివాడ డ్రైవర్స్ కాలనీకి చెందిన మోదుగుమూడి రంగారావు రాత్రి 12:30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆవులను తప్పించబోయి లారీని ఢీకొనడం ద్వారా మృతిచెందడం జరిగిందన్నారు. వాహనాలకు ఆవులు అడ్డు రావడం ద్వారా తప్పించబోయే సమయంలో వాహనాలని ఢీకొనడం జరుగుతుందన్నారు.

మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

గ్రీన్ గుడివాడ అని ఎమ్మెల్యే చెప్పడం జరుగుతుంది కానీ ఎక్కడపడితే అక్కడ రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటం, చెత్తా చెదారంతో నిండి ఉన్న వాటిని తినటానికి ఆవులు ఉండటం ద్వారా వాటిని తప్పించబోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రేపానికొండ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కష్ణా): ఉపాధి హామీ, జలజీవన్ మిషన్ వంటి పథకాల క్రింద చేపట్టిన పనులు వేగవంతం చేయాలని, పనుల నాణ్యత పట్ల రాజీ పడవద్దని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ మీకోసం హాల్లో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, డ్వామా, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి ఆయా శాఖల ద్వారా జరుగుతున్న అభివద్ధి పనులు మండల వారి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల జీవన్ మిషన్, ఉపాధి హామీ పథకాల క్రింద చేపట్టే పనులకు నిధుల కొరత లేదని, అయినప్పటికీ పనుల గ్రౌండింగ్ ఆలస్యం కావడం పట్ల కలెక్టర్ అసంతప్తి వ్యక్తం చేస్తూ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్నిచోట్ల హౌసింగ్ కాలనీలలో రహదారుల పనులు చేపట్టుటకు మెరక చేయాల్సిన పరిస్థితి ఉందని, ఉపాధి హామీలో మెరక పనులు చేయుటకు అవకాశం లేనందున పనుల గ్రౌండింగ్ ఆలస్యం అవుతున్నాయని డిఈ లు తెలుపగా, ఆయా గ్రామపంచాయతీలు మెరక పనులు చేసుకుంటే, రహదారి పనులు ఉపాధి హామీలో చేపట్టవచ్చన్నారు. ఈ ఈ లు, డి ఈ లు, ఏఈలు సమన్వయంతో పనిచేయాలని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. చేసిన పనులు కరెక్ట్ గా రికార్డు చేసి సకాలంలో బిల్స్ అప్లోడ్ చేసి, కాంట్రాక్టర్లకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేపట్టిన పనులకు అప్పటివరకు పూర్తయిన పార్ట్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లింపుల కోసం అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కాంట్రాక్టర్లను బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిప్పుకోవద్దని, నా చుట్టూ తిరిగేలా చేయవద్దని సూచించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు చేసిన పనులన్నింటికీ చెల్లింపులు జరగాలని, సంక్రాంతిలోగా పనులన్ని పూర్తి చేయాలని అన్నారు.

కృష్ణాపురంలో పొలంబడి

ప్రజాశక్తి-పమిడిముక్కల: రైతులు జాగ్రత్తగా వరి ధాన్యాన్ని మిల్లులకు చేర్చాలని అపరాల పంటను కాపాడుకోవడానికి విత్తన శుద్ధి చేయాలని గన్నవరం వ్యవసాయ సంచాలకులు ఎ.సునీల్ అన్నారు. బుధవారం పమిడిముక్కల మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మినుము, పెసర విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని ఒక లీటరు నీటిలో ఐదు మిల్లీమీటర్ల ఇమిడి క్లోరైడ్ ద్రావణాన్ని కలపాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యం అమ్ముకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

ప్రజాశక్తి-గన్నవరం: మండలంలోని ముస్తాబాదలో బాలికపై పలుమార్లు యువకుడు అత్యాచారానికి పాల్పడటంతో గర్భం దాల్చింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పులవర్తి ప్రశాంత్ అదే గ్రామానికి చెందిన బాలికపై పలు సార్లు అత్యాచారం చేశాడు. ఆ బాలిక కడుపులో నొప్పి అంటూ ఇంట్లో చెప్పింది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షలు చేసి ఏడు వారాలు గర్భం అని తెలిపారు. ఎవరు ఏమిటని ఆ బాలికను తల్లిదండ్రులు గట్టిగా ప్రశ్నించటంతో ప్రశాంత్ కారణమని చెప్పింది. వెంటనే పోలీసులను ఆశ్రయించి బుధవారం ఫిర్యాదు చేశారు. అతనిపై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

నేడు గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జే ప్రభుదాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు వారోత్సవాలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుదాస్ తెలిపారు.

రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కంకిపాడు: రోడ్ల అభివద్ధి పనుల్లో భాగంగా తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురు గ్రామం ఇందిరా నగర్-2లో రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్‌రావు, టిడిపి జనసేన సమన్వయకర్త ముప్పా రాజా తదితరులు పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. గుడివాడ గ్రామానికి చెందిన ఇంటి రాము సౌజన్యంతో లక్ష దీపోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

ఇసుకపై ఆంక్షలు ఎత్తేయాలని ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఇసుకపై ఆంక్షలు తొలగించి నిర్మాణ రంగ కార్మికులకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ కృష్ణాజిల్లా బిల్డింగ్ అండ్ కనెక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రుస్తుంభాదా గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మచిలీపట్నం ఏరియా నాయకులు టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఉన్న వైసిపి, ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వాలు అధికారం చేపట్టిన వెంటనే భవన నిర్మాణానికి అవసరమైన ఇసుకపై కఠినమైన ఆంక్షలు విధించడం వల్ల కార్మికులకు పని లేకుండా పోయిందని దీనివల్ల కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఉచిత ఇసుక పంపిణీ పేరుతో కూటమి ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించి దళారులు నియమించటం వల్ల గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వము హాయంలో ఇసుక ధర అనేక రెట్లు పెరిగిందన్నారు.

కఠినమైన నిబంధనలు విధించటం వలన ఇసుక లభ్యం కాక కార్మికులు పనులు లేక పస్తులతో కాలం గడుపుతున్నరన్నారు. కనుక వీరికి ప్రభుత్వం వెంటనే జీవనభతి కింద ప్రతి కార్మికునికి రూ.6 వేలు ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఇసుకపై నిబంధనలను వెంటనే సడలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా నాయకులు లింగం ఫిలిప్, నాయకులు మోదుముడి నాగరాజు, చిట్టి బొమ్మ వీర వెంకటేశ్వరరావు, కలిదిండి శ్రీను, కాయల నాగేశ్వరరావు, ఏ వెంకటేశ్వరరావు ,కొండపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టీ షర్టులు బహూకరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యులు బొండాడ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత డాక్టర్ బండ రాఘవేంద్రరావు సౌజన్యంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అవనిగడ్డ బ్రాంచ్ చైర్మన్ వంగర శేషగిరిరావు 20 మంది విద్యార్థులకు టీ షర్టులు అందజేశారు. బుధవారం కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మారాణి ఆధ్వర్యంలో టీషర్టులు అందజేశారు.

ధరల నియంత్రణ, సమస్యల పరిష్కారానికే ప్రజాపోరు

విజయవాడలో...

వన్‌టౌన్ 50వ డివిజన్‌లో సంతకాల సేకరణ

కంచికచర్లలో

ప్రజాశక్తి - విజయవాడ : అధిక ధరలు అరికట్టాలని, స్మార్ట్ మీటర్లు వద్దని, పెట్రోలు, డీజిల్ ధరలు నియంత్రించాలని, చౌక డిపోల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తు ధరలు ఇవ్వాలని, వరద బాధితులకు సహాయం అందించాలని 14న కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం 63వ డివిజన్ సుందరయ్య నగర వద్ద ప్రజాపోరు యాత్ర జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలపై విపరీతమైన భారాలు వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి బొంగు రాంబాబు, సభ్యులు పి.సాంబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **వన్‌టౌన్ :** ప్రజలపై భారం మోపే ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. విద్యుత్ ట్రూ అఫ్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని, రేషన్ డిపోల్లో 14 రకాల నాణ్యమైన సరుకులు బియ్యం ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ బుధవారం సిపిఎం పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో 'ప్రజా పోరు'లో భాగంగా 50వ డివిజన్ ఖాదర్ సెంటర్, 49వ డివిజన్ వాగు సెంటర్‌లలో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు, పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు జి ఆదిలక్ష్మి పాల్గొని ప్రజలతో సంతకాలు చేయించారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ సిపిఎం కార్యదర్శి జి.బాలదుర్గావు. నాయకులు యన్ గురప్ప, పి.శ్రీను, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** స్థానిక రైతుబజార్ సెంటర్లో ప్రభుత్వ వైఫల్యాలపై కరపత్రాలను సిపియం నాయకులు ఎం.సోమేశ్వరరావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.భూషణం, తదితరులు పాల్గొన్నారు.

వెలంపల్లిని విమర్శించే ముందు రాజీనామాలు చేయండి : వైసిపి కార్పొరేటర్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఫ్యాన్ గుర్తుపై గెలిచి పార్టీ మారిన కార్పొరేటర్లు తమ నాయకుడు వెలంపల్లిపై మాట్లాడే ముందు తమ కార్పొరేటర్ల పదవులకు రాజీనామా చేసి మాట్లాడాలని వైసిపి కార్పొరేటర్లు మండేపూడి చటర్జీ, పడిగిపాటి చైతన్య రెడ్డి, ఎండి ఇర్ఫాన్, శీరంశెట్టి పూర్ణ, పార్టీ మైనారిటీ నాయకులు హయత్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బ్రాహ్మణ వీధిలో గల పశ్చిమ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం అంటే మొట్టమొదటిగా గుర్తుకు వచ్చే వ్యక్తి వెలంపల్లి అని అన్నారు. పశ్చిమ నియోజకవర్గానికి అభివృద్ధికి బాటలు వేసింది కూడా వెలంపల్లి అని, నియోజకవర్గం దాదాపుగా 65 శాతం కొండ ప్రాంతం అయినందున ఈ కొండ ప్రాంతాల్లో మెట్ల మార్గాలు, కాలువలు, రిటైనింగ్ వాల్స్, వాటర్ ట్యాంక్‌లు నిర్మాణం తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేయించిన వ్యక్తి వెలంపల్లి అని కొనియాడారు. అటువంటి అభివృద్ధి రూపకర్త అయిన వెలంపల్లిపై బురద జల్లడం సబబు కాదన్నారు.

కృష్ణారావు వర్ధంతి సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రాజీవ్ గాంధీ హోల్‌సేల్ మార్కెట్ మాజీ గౌరవ అధ్యక్షులుగా బత్తుల కృష్ణారావు మార్కెట్‌కి ఎన్నో సేవలందించారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ అన్నారు. బుధవారం కెనాల్ రోడ్‌లోని రథం సెంటర్ వద్ద బత్తుల దుర్గారావు, బత్తుల తులసి లక్ష్మీనారాయణ, ఆధ్వర్యంలో కృష్ణారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ హోల్‌సేల్ మార్కెట్ గౌరవ అధ్యక్షులుగా, మరెన్నో పదవులను నిర్వహించడం ద్వారా ఆయన ఎన్నో సేవలందించారని కొనియాడారు. ఆవాల మారుతి, విశ్వనాధ రవి, యర్రంశెట్టి అంజిబాబు బొమ్ము మధు, తదితరులు నివాళు లర్పించారు.

కార్పొరేషన్ల చైర్మన్లకు సత్కారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో నూతనంగా గవర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పివిజి కుమార్ దంపతులు బుధవారం టిడిపి ఉత్తరాంధ్ర ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నను ఆయన నివాసం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. కాగా ఇరువురు కార్పొరేషన్ చైర్మన్లను శాలువలతో సత్కరించిన బుద్దా వెంకన్న వారికి శుభాకాంక్షలు తెలిపారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ సుజనా చౌదరి

డ్రగ్స్ రహిత సమాజానికి కృషిచేయాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్, విజయవాడ అర్బన్ : డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఏర్పడే దుష్ఫలితాల పట్ల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు అందరం సమిష్టిగా కృషి చేయాలని విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి) అన్నారు. ఎంజె నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ 38వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా బెంజ్ సర్కిల్ జ్యోతి కన్వెన్షన్ సెంటర్‌లో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు సుజన చౌదరి, కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. వారు మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా చైతన్యం కలిగించే కార్యక్రమాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు.హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ఎమ్ జె నాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ మాధవి, డాక్టర్ వంశీ, సైకియాట్రిస్ట్ రాధిక రెడ్డి, సిద్ధార్థ మహిళ కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ దేవినేని అపర్ణ పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

విజయవాడ : నవజీవన్ బాల భవన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం డిబి లెర్నింగ్ స్కూల్లో ఉన్న పిల్లలందరికీ కెరీర్ గైడెన్స్ గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీలం రత్న కుమార్, ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంతయ్య, అడ్మినిస్ట్రేటివ్ జోసెఫ్ తంబీ మాట్లాడారు. పిల్లలందరూ మంచిగా చదువుకొని వారి భవిష్యత్తుని బాగా చూసుకోవాలని, తల్లిదండ్రులు పనులకు వెళ్లిన వారు తమ గురించే కష్టపడుతున్నారనే విషయాన్ని గమనించుకొని మసలుకోవాలని సూచించారు. పిల్లల బాధ్యత చదువుకోవటం అని మొదటి అడుగు చదువు వైఎ ఉండాలని చెప్పారు. అనంతరం కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ అయినా సిహెచ్.ప్రసన్న మాట్లాడుతూ ప్రతి టీచర్ పిల్లల పట్ల బాధ్యత కలిగి నడుచుకోవాలన్నారు. అనంతరం ప్రోగ్రాం మేనేజర్ అయినా ఎమ్‌డి.వసంత మాట్లాడుతూ పిల్లలకు మంచి ప్రవర్తన ,మంచి అలవాట్లు, శారీరక ఎదుగుదల, మానసిక దఢత్వం, ఇలా ఎన్నో విషయాల మీద అవగాహన కల్పిస్తూ తెలిపారు. ఇందులో డాన్‌బాస్కో లెర్నింగ్ సెంటరు టీచర్స్ అందరు పాల్గొన్నారు.

హాకర్లపై దౌర్జన్యం చేస్తే ఊరుకోం : విష్ణు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో హాకర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విఎంసి అధికారులు వ్యవహరిస్తున్న తీరు బాధాకరమని వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగరంలోని చిరు వ్యాపారులకు కష్టాలు మొదలయ్యాయని అభిప్రాయపడ్డారు. కక్ష సాధింపులతో పలుచోట్ల దుకాణాలను బుల్డోజర్స్‌తో కొట్టేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, బడుగు, బలహీన వర్గాల పొట్టకొట్టడం సమంజసం కాదన్నారు. విజయవాడ నగరం రాష్ట్రానికి నడిబొడ్డున ఇటు రాయలసీమకు, అటు ఉత్తరాంధ్రకు మధ్య కేంద్రంగా ఉంటుందన్నారు. లెనిన్ సెంటర్, బిఆర్‌టిఎస్ రోడ్డు, బుడమేరు వంతెన వద్ద, కండ్రిక, ప్రకాష్ నగర్లలో దుకాణాలను చూస్తేనే ఈ విషయం అర్థమైపోతుందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలు... పొట్టచేత పట్టుకుని వచ్చిన వారికి శరాఘాతంగా మారుతున్నాయని ఆరోపించారు. సీ ప్లేన్లో విజయవాడ నుంచి శ్రీశైలం వెళితే, గన్నవరం నుంచి విమానాలలో విశాఖ వెళితే పండుగలా సంబరాలు చేసుకునే ఈ ప్రభుత్వానికి పేదల ఆకలి కేకలు మాత్రం ఎందుకు పట్టవని ప్రశ్నించారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలు, విఎంసి అధికారుల దౌర్జన్యంపై కౌన్సిల్ సమావేశంలో కచ్చితంగా నిలదీస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఇళ్ల స్థలాలివ్వాలని న్యాయవాదుల వినతి

వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - నందిగామ : అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలివ్వాలని నందిగామ ఆర్‌డిఒ బాలకృష్ణ, నందిగామ మండల తహశీల్దార్ సురేష్‌లకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకుమల్లి రామారావు ఆధ్వర్యంలో న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. సీనియర్ న్యాయవాది కన్నెగంటి జీవరత్నం, వైస్ ప్రెసిడెంట్ బలుసు పాటి సురేష్, నందిగామ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు , నందిగామ బార్ ప్రెసిడెంట్ నండ్రు బాబు విద్యాసాగర్, సెక్రటరీ శ్రీ అద్దంకి మణి బాబు, షేక్ సైదా, ఆనందం విజయభాస్కర్, జెట్టి కృష్ణ, బెజవాడ గోపి, అన్నెపాక సుందర్ రావు , జిల్లేపల్లి రంగారావు, దున్న కోటేశ్వరరావు, న్యాయవాదుల బృందం పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన కాకతీయ విద్యార్థి

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు కాకతీయ విద్యార్థి

ప్రజాశక్తి - నందిగామ : జాతీయస్థాయి సిమ్మింగ్ పోటీలకు నందిగామలోని కాకతీయ సిబిఎస్ఇ విద్యార్థి ఎంపికయ్యారు. ఈ నెల 5, 6 తేదీల్లో అండర్ 14, 15, 19, 68వ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు పల్నాడు జిల్లాలోని నరసరావుపేటలో నిర్వహించారు. అండర్ 14 విభాగంలో ఎస్.కీర్తన్ కాకతీయ విద్యార్థి మూడు బంగారు పతకాలు గెలుపొందారు. ఈ నెల 23 నుండి 30 వరకు గుజరాత్లో రాజ్కోట్‌లో జరిగే జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థికి కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్, భారతి, కాకతీయ డైరెక్టర్ కాపా కార్తికేయ, సుష్మా, ప్రిన్సిపల్ సత్యమూర్తి ఉపాధ్యాయులు, స్విమ్మింగ్ కోచ్ గోపీచంద్ విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా నందిగామకు పేరు తీసుకురావాలని ఆకాక్షించారు.

శంకుస్థాపన చేస్తున్న యేదుపాటి రామయ్య

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక ఎంఎల్ఎ సుజనా చౌదరి, పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుండి భవానీపురం టెలిఫోన్ కాలనీలో సుమారు రూ.7 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి బుధవారం స్థానిక మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గతంలో వరదల వల్ల కల్వర్టులు దెబ్బతిన్నాయని, ఇవన్నీ స్థానిక ఎంఎల్ఎ, ఎంపి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఏఈ భాష, కాంట్రాక్టర్ సిద్ధిక్, స్థానిక టిడిపి నాయకులు బూత్ ఇంచార్జి విత్తం శివకుమార్, డాక్టర్ భాస్కరరావు, మాలాద్రి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం సభ్యులు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - మైలవరం : యుటిఎఫ్ మైలవరం మండల శాఖ అధ్యక్షులుగా ఎం.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా వాడపల్లి వసంతరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ మైలవరం మండల శాఖ మహాసభ బుధవారం ఆ సంఘ కార్యాలయంలో జరిగింది. ఉమ్మడి కష్ణాజిల్లా యుటిఎఫ్ శాఖ అధ్యక్షులు కుక్కడపు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కె.గంగరాజు, సీనియర్ యుటిఎఫ్ నాయకులు పాల్, బాబూరావు, పాలగిరి వెంకటేశ్వర రెడ్డి, జి.సూర్య కుమారి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంగినపూడి బీచ్‌లో పగడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం మచిలీపట్నం మండలంలోని మంగినపూడి బీచ్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలిసి దుస్తులు మార్చుకొను గదులు, రేఖా చిత్రపటంలో వివిధ విభాగాల ప్రదేశాలను కార్తీక పౌర్ణమి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌కు ఒకరోజు ముందుగానే పెద్ద ఎత్తున భక్తులు, పర్యాటకులు వస్తారని వారికి కావలసిన ఏర్పాట్లు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి వేడివేడి పాలు పంపిణీ చేయడంతో పాటు వారు తప్పిపోకుండా చేతికి టాకింగ్ వేయాలన్నారు.అన్ని విభాగాల వద్ద చెత్త కుండీలు ఏర్పాటు చేసి నిండిన వెంటనే ఎప్పటికప్పుడు తరలించేలా ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. ఎక్కడ ఏమి విభాగాలు ఉన్నాయో వివరించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సముద్రంలో లో టైడ్, హై టైడ్ ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎర్రటి జెండాలతో గుంజలు నాటి తాళ్లతో కట్టి పక్కాగా. బారికేడింగ్ చేయాలని, వాటిని దాటి ప్రజలు ఎవరు సముద్రం లోపలికి పోకుండా పోలీసులు,

బీచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

గజఈతగాళ్లు అందరూ ఒకచోట కాకుండా కొద్దికొద్ది దూరంలో ఉంటూ పర్యవేక్షించాలన్నారు. ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అక్కడికి పోలీసులు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. లైఫ్ జాకెట్లు, లైవ్ బాయిలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.ప్రజలను అనుమతించిన ప్రదేశం వరకు తప్పనిసరిగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని వాటిని దాటిపోకుండా పోలీసులు గట్టి నిఘా ఉంచాలన్నారు ఒక పోలీస్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేసి డ్రోన్ ద్వారా దశ్యాలు చిత్రీకరిస్తూ ఫాల్కన్ వాహనానికి అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు రద్దీ ప్రాంతాలను గుర్తించి అక్కడ రద్దీ లేకుండా పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హైమాస్ విద్యుత్ దీపాలు, జనరేటర్లతో పాటు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు.ఈ కార్తీక పౌర్ణమి ఉత్సవాలు పూర్తయ్యే వరకు ఎవరికీ ఎలాంటి సెలవులు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ గైడ్స్ వంటి స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలను తీసుకోవాలన్నారు.వైద్య శిబిరం ఏర్పాటు చేసి బీచ్ కు వచ్చే భక్తులకు, పర్యాటకులకు ఏమైనా ఆరోగ్య పరమైన ఇబ్బందులు ఎదురైతే మందులు అందజేసి చికిత్స చేయాలన్నారు.వాహనాలను అన్నింటిని పార్కింగ్ ప్రదేశంలో నిలుపుదల చేసి అక్కడి నుండి ప్రజలు కాలినడకన బీచ్కు చేరుకునేలా చూడాలన్నారు.పోలీసు అవుట్ పోస్టు వద్ద అధికారుల వాహనాలు నిలుపుకొనుటకు ఏర్పాటు చేయాలన్నారు.కార్తీక పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున 4 గంటలకే హారతి ఇచ్చే కార్యక్రమానికి తొక్కిసలాట జరగకుండా ఏర్పాట్లు కూడ పక్కాగా చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రజల అవసరాలను బట్టి బీచ్ కు వెళ్లేందుకు ఈ నెల 14 నుండి ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని 15వ తేదీన ఉదయం 3 గంటల నుండి ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డిఓ కే స్వాతి, డిపిఓ జే అరుణ, డిపిటీవో వాణిశ్రీ, ఆర్టీసీ డిఎం పెద్దిరాజు, దేవాదాయ శాఖ ఏసి సాంబశివరావు, డిఎంహెచ్వో డాక్టర్ గీతాబాయి, రహదారులు భవనాల శాఖ ఈఈ లోకేష్,పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణరావు, జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, ఐ సి డి ఎస్ పి డి సువర్ణ,డిఎస్పి అబ్దుల్ సుభాని,అగ్నిమాపక అధికారి ఏసురత్నం, మెరైన్ ఎస్ఐ జగదీష్ చంద్రబోస్, ఎంవిఐ శ్రీనివాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై 104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి-గన్నవరం: సమస్యలు పరిష్కరించాలని 104 సిబ్బంది డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి సకాలంలో జీతాలు చెల్లించాలని, 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఓలకు జిఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని, బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 కృష్ణాజిల్లా కోశాధికారి బి.సుబ్బారావు, ఉమా పాల్గొన్నారు.

వర్షంతో తడిసిన ధాన్యం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి కోత కోసిన వరి ధాన్యం తడిచిపోయింది. మండలంలోని కొన్ని గ్రామాల్లో మిషన్లతో కోసిన వరి పంటను రైతులు ఒడ్డుకు చేర్చారు. అయితే భారీ వర్షం ఒకసారిగా రావడంతో కొన్నిచోట్ల ధాన్యం వర్షపు నీటితో తడిచిపోయి రైతుకు నష్టం వాటిల్లింది. కొంతమంది రైతులు పరదాలతో ధాన్యం బస్తాలపై కప్పి జాగ్రత్త చేశారు. వేమవరం ప్రధాన రహదారిపై ధాన్యం రాశులు, సంచులతో నింపిన ధాన్యం బస్తాలు వర్షం బారిన పడటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత కళ్లజోళ్లను బుధవారం పంపిణీ చేశారు. 33 మంది విద్యార్థులకు కళ్లజోళ్లను లయన్ అరెకపూడి రామకృష్ణచౌదరి వారి కుమారుడు శివహర్ష

జ్ఞాపకార్థం వారి ఆర్థిక వితరణతో ఉచితముగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్ ఏ ఆర్ కేచౌదరి, వైపీసీ ప్రసాద్ నిమ్మగడ్డ శశికళ పాల్గొన్నారు.

వి క్యూబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: వి క్యూబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 12, 13 తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు జరిగాయి. మొదటి రోజు బాలికల కబడ్డీ, ఖోఖో పోటీలు జరగ్గా, రెండో రోజు బాలుర కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరిగాయి. వీ క్యూబ్ ఫౌండేషన్ వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నారాయణ, వినయ్‌కుమార్, ఎంఈఓ-1, 2 జి.జగన్‌మోహనరావు, జి.గోపాలరావు, వీ క్యూబ్ ఫౌండర్లు పామర్తి వీర రాఘవులు, మోదుగుమూడి అంకాలరావు తదితరులు పాల్గొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 14వ తేదీ బాలల దినోత్సవం అంగలూరు బాలికొన్నత పాఠశాలలో ఘనంగా జరగనుందని, ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు, ఉపాధ్యాయులకు సన్మానం చేయనున్నట్లు వి క్యూబ్ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి ఆటల పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు స్థానిక గ్రంథాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారిని టి.వాణి తెలిపారు. ఈ కార్యక్రమాలను ఎంపీడీవో టి.విజయసారథి గురువారం ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే వారం రోజులు పాటు విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు చివరి రోజు బహుమతులు అందించినున్నట్లు తెలిపారు.

ఉయ్యూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుండి బుధవారం వరకు పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచ న, దేశభక్తి గేయాలు, విచిత్ర వేషాధారణ, వక్తృత్వం, రంగవల్లుల పోటీలు నిర్వహిసు న్నట్టు గ్రంథాలయ అధికారి బి.రమణి తెలిపారు.

రేపు రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం: ఈ నెల 15న గన్నవరం రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అవుటపల్లి మోహనరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు, కృష్ణసాయి దంత వైద్యశాల వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని, రిటైర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐదో రోజుకు దీక్షలు

ప్రజాశక్తి-బంటుమిల్లి

బంటుమిల్లి మెయిన్ కాలువ పరిధిలో దాళ్వా పంటకు ప్రభుత్వం అనుమతివ్వాలని కోరుతూ బంటుమిల్లి సెంటర్‌లో చేపట్టిన దీక్షలు బుధవారం ఐదో రోజుకు చేరాయి. ఈ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి అధ్యక్ష కార్యదర్శులు మలిశెట్టి శివరాం ప్రసాద్, లంకదాసుల అజయ్ ఘోష్, సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధన్‌రావు, వెంట్రపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీలో ఐఒటి వర్కుషాప్ ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో బుధవారం నుండి మూడు రోజుల వరకు అనిత టెక్నాలజీస్ సంస్థ నుండి వచ్చిన మణికంఠ అతని టీమ్ సభ్యులతో నిర్వహించే వర్క్ షాప్‌ను కళాశాల ప్రిన్సిపల్ డా.ఆర్ విజయ కుమారి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల విద్యార్థులకు క్యాంపస్ లోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాల శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకే సుందర కష్ణ మాట్లాడుతూ సాంకేతికంగా వేగంగా ముందుకు పోతున్న ఈ రోజుల్లో ప్రత్యేకంగా సాంకేతిక విద్యారంగంలోని విద్యార్థులకు కనీస నైపుణ్యం లేకపోతే ఉద్యోగ అవకాశాలు పొందడం చాలా కష్టతరం అవుతుందన్నారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలోని మూడవ సంవత్సరం మరియు నాలుగవ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించే ఈ మూడు రోజుల వర్క్‌షాప్‌కు సమన్వయకర్తగా కె.జి.వెంకటకృష్ణ వ్యవహరించనున్నారు.

బోధనేతర పనుల నుండి విముక్తి కలిగించాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి-గన్నవరం: ప్రభుత్వం పే రివిజన్ కమిషన్ అమలు చేసే లోపు మధ్యంతర భృతి ప్రకటించాలని ఫ్యాప్టో నాయకులు దేవరపల్లి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. జడ్పీహెచ్ఎస్ దావాజీగూడెం, జడ్పీహెచ్ఎస్ (బాలికలు) గన్నవరం, జడ్పీహెచ్ఎస్ (బాలురు) గన్నవరం, జడ్పీహెచ్ఎస్ కేసరపల్లి, జడ్పీహెచ్ఎస్ గొల్లనపల్లి లో ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గత ప్రభుత్వం ఉపాధ్యాయ వర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకూడదని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే వర్తింపచేయాలని నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొక్కినాల శ్రీధర్, మండలం అధ్యక్షుడు మోట్రు ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రిళ్లూ ఇసుక దందా

ప్రజాశక్తి-చల్లపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా గుప్పెడు ఇసుక బయటకు వెలితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ అధికారులు జారీ చేసిన హెచ్చరికలు ఏమయ్యాయని ప్రభుత్వాధికాలను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక మండల పరిధిలో పెద్దఎత్తున ప్రధాన క్వారీలకు ఉన్న రహదారులను గండ్లు కొట్టి వందల సంఖ్యలో వాహనాలలో ఇసుకను తరలిస్తుంటే అధికారులు

స్పందించక పోవటం చర్చనీయాంశంగా మారింది. గతంలో పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నారని ఇది పర్యావరణానికి ఇబ్బందికరమని భవిష్యత్తులో ప్రమాదాలకు కారణం అవుతాయని తక్షణమే ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని గోల చేసిన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారనిపలువురు విమర్శిస్తున్నారు. స్థానిక మండలపరిధిలోని నడకుదురు కృష్ణానదిలో రాత్రి సమయంలో అక్రమ ఇసుక త్రవ్వకాలు నిర్వహించి వందల ట్రాక్టర్లలో తరలిస్తున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవలే అవే ప్రాంతాలలో ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్న అధికారులపై ఇసుక మాఫియా దౌర్జన్యాలు చేసిన సంఘటనలు ఉన్నాయి అదే మాఫియా యదేచ్ఛగా ఇసుక యంత్రాల సహాయంతో ఇసుక త్రవ్వి వందల సంఖ్యలో వాహనాలలో తరలిస్తుంటే తెలిసి తెలియక, చూసి చూడనట్లు అధికారులు ఎందుకు వ్యవహరిస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది.ఎడ్లబండ్లే జీవనాధారంగా ఉన్న పేద కూలీలు మాత్రం గుప్పెడు ఇసుక బయటకు తీసుకురాకూడదని కఠిన ఆంక్షలు విధించారు. ఎడ్లబండ్లకు ఇసుక తరలించే అనుమతులు లేకపోవడం వలన ఎడ్లబండ్ల యజమానులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.ఇక్కడ ఇసుక మాఫియా విధించిన గీటురాయిని దాటే పరిస్థితిలో అధికారులు ఎవరూ కూడా ఉన్నట్లు అనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రాత్రుల సమయంలో జరిగే అక్రమ ఇసుక తవ్వకాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

సిసి రోడ్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి గ్రామం ప్రధాన రహదారి నుండి దళితవాడకు వెళ్లే రోడ్లో సిసి రోడ్డు నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన గ్రామ సర్పంచ్ రాయల నాగరాణి ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో సిసి రోడ్లు ఒకటని తమ గ్రామానికి కేటాయించినంత వరకు సిసి రోడ్లు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేస్తామని జాప్యం జరగకుండా చూసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ దేవసహాయం అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ టిడిపి నాయకులు రాయల సురేష్ రాయల వేణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : బాలల దినోత్సవం సందర్భంగా రంగాపురం ఎంపిపి పాఠశాలలోని పిల్లలకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థులందరికీ నోటుపుస్తకాలు, పెన్నులు బిస్కెట్లు, ఇచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం దళితవాడలోని అంగన్వాడీ కేంద్రం పిల్లలకు పలకలు,బిస్కెట్ లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల గాంధీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చాపలమడుగు కాంతారావు, నాయకులు సుందరరామిరెడ్డి, రమేష్ బాబు, రమేష్, మణికంఠ, క్రాంతిబాబు, గంగాధర్, సురేష్, ముత్తారావు, నాగరాజు, అశోక్, సుభాని, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తిరువూరు : తల్లిదండ్రులను కోల్పోయిన ఎస్ఐ సత్య నారాయణ ఆర్థిక సహాయం చేశారు. తిరువూరు బస్టాండ్ సమీపంలో గల ఐడియా సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ దయ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు బాలికలకు (5,7 తరగతులు) పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఆర్థిక సహాయం అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ 28 సంవత్సరాలుగా ఐడియాస్ చేస్తున్నా అనాథ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి, ఐడియాస్ కో-ఆర్డినేటర్ బుడుపుల పండు వరప్రసాద్, ఈ విద్య లోక కో-ఆర్డినేటర్ కొంగల రవి బాబు పాల్గొన్నారు.

దూండీ నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా దూండీ రాకేష్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆర్యవైశ్య సంఘం నాయకులు బుధవారం సాయంత్రం వన్‌టౌన్‌లోని సామారంగం చౌక్ వద్ద కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ జె.నాగార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వం, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విజయవాడ : కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన సత్యనారాయణపురం చిత్తరంజన్ శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సెంట్రల్ ఎంఎల్ఎ బొండా ఉమా మహేశ్వరరావు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ టిడిపి వర్కింగ్ ఇన్చార్జి గార్లపాటి విజయ్ కుమార్ పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక, హైస్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడా పోటీలు జానపద గీతాలు పోటీలు తదితర అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. వారోత్సవాల సందర్భంగా ఆర్.శ్రీనివాస్ (రిటైర్డ్ ఉద్యోగి)విద్యార్థుల కోసం అల్పాహారం ఏర్పాటు చ ఏసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ కె.కె.ప్రణీత, తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశానుసారం గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయం జగ్గయ్యపేటలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుండి

చిత్తరంజన్ శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బొండా ఉమా, గ్రంథాలయ సిబ్బంది

20 వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ తెలిపారు. బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రభ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థినులకు 14వ తేదీ శతక పద్య పోటీలు, 15వ తేదీ పుస్తక ప్రదర్శన, ఈ నెల 16వ తేదీ గన్ని బ్యాగ్స్ పోటీ, 17వ తేదీ వ్యాసరచన, 18వ తేదీ చిత్రలేఖనం పోటీ, 19వ తేదీ మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలు ప్రతిరోజు సాయంత్రం 5.30 నిమిషాలకు 'సాహితీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. **గంపలగూడెం :** గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని గోడపత్రికలను ఆవిష్కరించినట్లు పెనుగొలను గ్రంథాలయ ఇన్చార్జి శ్రీలత తెలిపారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారి పివిడిఎల్ నరసింహారావు సదరు పత్రికలను ఆవిష్కరించినట్లు వివరించారు.

25 నుంచి 108 కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - తిరువూరు : రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 108 కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 25 నుంచి చేస్తున్న సమ్మె నోటీసును జిల్లా వైద్య అధికారికి ఎపి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అందజేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడలో బుధవారం జరిగింది. తమ సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యానికి, అధికారులకు వివిధ రూపాల్లో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పరిష్కరించలేదని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, నరసింహారావు అన్నారు. దీనితో సమ్మె చేయాల్సి వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీసులను నేరుగా నిర్వహించాలని, అధికారులిచ్చిన హామీ మేరకు స్లాబ్‌ల ప్రకారం అందరికీ వేతనాలు చెల్లించాలని, సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్లను అప్ గ్రేడ్ చేయాలని, వైద్య, ఆరోగ్య శాఖలోని ఇఎంటి పోస్టుల్లో 108 ఇఎంటిలను నియమించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, సహజమరణం, ప్రమాదాల్లో చనిపోయిన

ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, గత టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన జిఒ ఎంఎస్ నెంబరు 49 ప్రకారం అమలు చేసి నెలకు రూ.నాలుగు వేలు తిరిగి పునరుద్ధరించాలని, చెల్లింపులకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులను వారి వారి సొంత జిల్లాలకు బదిలీలు చెయ్యాలని, 108 సేవల్లో ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్లు చెప్పారు.

చింతలపూడి ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకోవాలి

ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి - మైలవరం : చింతలపూడి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఎపి అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం ప్రశ్నోత్తరాల్లో భాగంగా చింతలపూడి ఎత్తిపోతల సాగునీటి ప్రాజెక్టు పురోగతిపై ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో తొలి ప్రశ్నలు అడిగే అవకాశం కల్పించారని, నాగార్జునసాగర్ ప్రాజెక్టు మూడో జోన్ పరిధిలో చివరాయకట్టుకు ఎగువ ప్రాంతం నుంచి నీరు సక్రమంగా రాక సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. 2017లో

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోని చింతలపూడి ఎత్తిపోతల పథకం అనే బహుళ ప్రయోజన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారన్నారు. ఆరు సంవత్సరాల ముందు ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్లు, మోటార్లు నిరుప యోగంగా ఉన్నాయని వీటిని వినియోగంలోకి తేవాలని అన్నారు. చింతలపూడి పూర్తి అయితే తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 4 పార్లమెంట్ నియోజకవర్గాల్లో, 35 మండలాలకు కొత్తగా రెండు లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందన్నారు. మెట్ట ప్రాంత రైతులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ విప్ సౌమ్యకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి - నందిగామ : ప్రభుత్వ విప్ నందిగామ నియోజకవర్గ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యను బుధవారం మర్యాద పూర్వకంగా అధికారులు, నేతలు కలిశారు. కాకాని నగర్ కార్యాలయంలో నందిగామ ఎసిపి తిలక్, సిఐ వై.వి.ఎల్. నాయుడు, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాల ప్రసాద్, పార్టీ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెండో రోజు శాసనసభ సమావేశాలకు హాజరయ్యేందుకు సౌమ్య అమరావతి సచివాలయానికి వెళ్లారు.

తంగిరాల సౌమ్యను కలిసిన ఎసిపి తిలక్

బాలికను వేధిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - విజయవాడ : రాజరాజేశ్వరి పేటకు చెందిన బాలికను వేధింపులకు గురి చేస్తూ, అసభ్య పదజాలంతో ఇబ్బందులు గురి చేస్తున్నారని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై అజిత్ సింగ్‌నగర్ పోలీసులు పోస్కో చట్టం కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితులైన న్యూ ఆర్ఆర్ పేటకు చెందిన ఇద్దరిలో మెదటి ముద్దాయి పబ్బిశెట్టి కళ్యాణ్‌ను 11న అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ ఇచ్చారు. రెండో ముద్దాయి పబ్బిశెట్టి పవన్‌ను 12న అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరచనున్నారు.

పంచాయతీల పరిశీలన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పంచాయతీల పరిశీలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని గండ్రాయి, మల్కాపురం గ్రామ పంచాయతీలను బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.నితిన్ పర్యటించారు. ఈ పర్యటనలో ఎన్‌పిసిఎల్ హౌస్ హోల్డ్ సర్వేకి సంబంధించి సచివాలయ సిబ్బందిని పర్యవేక్షించారు.

అవగాహన కల్పిస్తున్న రామారావు

ఎయిడ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - కంచికచర్ల : కృష్ణ వెన్నెల మహిళా సొసైటీ ఆధ్వర్యంలో కంచికచర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం 'మీకు తెలుసా' కార్యక్రమం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ప్రతినిధి రామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. హెచ్ఐవి వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాప్తి చెందుతుంది, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వివిధ అంశాల గురించి తెలిపారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు చూడకుండా సమాజంలో కలిసిమెలిసి జీవించేలా సహకరించాలని కోరారు. సుఖ వ్యాధులు వివరాలను తెలిపారు. 2017 ఎయిడ్స్ యాక్టివ్ గురించి కూడా వివరించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ షిబా సిబ్బంది పాల్గొన్నారు.

విప్‌గా సౌమ్య నియామకంతో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - కంచికచర్ల : రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నందిగామ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య నియామకం పట్ల కంచికచర్లలో బుధవారం సాయంత్రం టిడిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మండల టిడిపి అద్యక్షుడు కోగంటి బాబు కేక్ కటింగ్ చేశారు. బాణాసంచా కాల్చుతూ సంబరాలు చేశారు.

నేడు పంచాయతీ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు, మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 14న మండల స్థాయి అధికారులు డిజిటల్, డిస్టెన్స్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులకు, వివో ప్రెసిడెంట్‌లకు పంచాయతీ రాజ్ వ్యవస్థలో ప్రణాళికలు తయారు చేసేందుకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.శ్రీను తెలిపారు.

పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి-ఉయ్యూరు: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో మొదటి మూడు స్థానాల్లో ఒకరుగా నిలిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు సూచించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉయ్యూరు రెవెన్యూ డివిజన్లో ఉయ్యూరు, పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, పామర్రు, మొవ్వ మండలాల్లో ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విద్యా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పటిష్ట పరీక్షా ప్రణాళికతో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. గత సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో 90.5 శాతంగా ఉన్న ఫలితాలు ఈవిద్యాసంవత్సరంలో నూరు శాతం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థులందరికి

గుడివాడలో మాట్లాడుతున్న డిఇఒ

అపార్ ఐడి పూర్తి చేసేలా చూడాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, ఇతర అంశాల్లోకూడి విద్యార్థులు రాణించేలా చూడాలన్నారు. డీవైఈవో పద్మారాణి, ఏఈవో-2 సుధారాణి, హెచ్ఎం జోత్స్నదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ డివిజన్ పరిధిలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఉపాధ్యాయుడు పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె రామారావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గుడివాడ డివిజన్ స్థాయి మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్, సిసిఇ మార్కుల నమోదు, 10వ తరగతి పరీక్షా ఫలితాలు, ప్రత్యేక తరగతులు, మధ్యాహ్న భోజన పథకాలపై చర్చించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టులో మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవలన్నారు. ఈ సమావేశంలో డిసిఇబి సెక్రటరీ జాన్‌సాహెబ్, సమగ్ర శిక్షా అధికారి శ్యామ్ పాల్గొన్నారు.

రమణకు సత్కారం

ప్రజాశక్తి-ఉయ్యూరు: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జీవీ రమణను జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ డివిజన్ ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశానికి హాజరైన ఆయన ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్న రమణను ఘనంగా సత్కరించి అభినందించారు. డీవైఈఓ పద్మారాణి, మండల విద్యాశాఖ అధికారి -2 సుధారాణి, హెచ్ఎం జోత్స్నదేవి, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమణను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఉంగుటూరు సబ్ స్టేషన్, సెక్షన్ పరిధిలో లంకపల్లి ఫీడర్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెబి శ్రీనివాస్ ఆదేశానుసారం ముక్కపాడు, జంజలవారికంద్రిక ప్రాంతాలలో గురువారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఉంగుటూరు ఎఇ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పైపులైన్ నిర్మాణానికి నిధులివ్వండి

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండల పరిధి లంకపలిలో జలసిరి పథకం ద్వారా రూ.20 లక్షలలో వాటర్ ట్యాంక్ నిర్మాణ చేపట్టారని పైపు లైన్ కు నిధులు మంజూరు చేయాలని ఎంపిడిఓ బి సుబ్బారావు కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. రాజ్యసభ మాజీ సభ్యులు కనకమేడల రవీంద్రబాబు ఎంపీ నిధుల నుండి 20 లక్షలు మంజూరు చేయగా, ట్యాంక్ నిర్మాణం జరిగిందన్నారు. పైపు లైన్ నిర్మాణానికి షుమారు 6 లక్షలు అవసరం ఉంది అని చెప్పారు. జడ్పీ నిధుల నుండి 2 లక్ష 30 వేలు మంజూరు చేశారని ఇంకా కావలసిన నిధులను మండల పరిషత్ నుండి మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో పరిసే చలపతి, కే.లీల క్రిష్ణ, వీరమాచినేని ప్రసాద్, తుమ్మల సందేశ్వరరావులు ఉన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-ఘంటసాల: కొడాలి, తాడేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వరి పొలాలను పరిశీలించిన అనంతరం మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట చివరి దశలో ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. చీడపీడల ఉధతి గమనించిన యెడల అధికారులు, శాస్త్రవేత్తల సూచనలతో తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.సుధారాణి మాట్లాడుతూ ప్రస్తుతం వరి పొలాల్లో మానిపండు తెగులును గమనించటం జరిగిందన్నారు. చిరుజల్లులు కురిసినప్పుడు వరి పూత, కంకి దశలో శిలింద్రంలో పెరుగుదల వల్ల పసుపు పచ్చ రంగు ముద్దగా అభివృద్ధి చెంది గింజలు రంగు మారతాయన్నారు. ఈ కార్యక్రమంలో కొడాలి గ్రామ ఉపసర్పంచ్ తుమ్మల శంకరరావు, పీఏసీఎస్ మాజీ చైర్ పర్సన్ తాతినేని వెంకట కేష్టారావు. కెవికె శాస్త్రవేత్త డా.నవీన్, ఏఏఓ వి.వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వెంకటరమణ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-కోడూరు: సహనశీల రాజకీయంతో అభివృద్ధికి కృషి చేసిన నాయకుడు వెంకటరమణ అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం పిట్టల్లంక శివారు బడేవారిపాలెంలో మాజీ సర్పంచ్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు బడే వెంకటరమణ నూతన విగ్రహాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివాదాలకు అతీతంగా రాజకీయాలు నడిపి వెంకటరమణ ప్రజల మనసులో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. అనంతరం గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామ ప్రముఖులు బడే రత్న ఆంజనేయులును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మర్రె గంగయ్య, కొండవీటి సునీత,

బండే రాఘవ, కనగాల వెంకటేశ్వరరావు, బావిశెట్టి ప్రభాకర్, ఎంపీటీసీ లంకే భాస్కరరావు, గుడిసేవ సూర్యనారాయణ, యలవర్తి వెంకన్న, కొప్పనాతి సత్యనారాయణ, కాగిత రామారావు, రెడ్డెబోతు కృష్ణబాబు, జరుగు ఆదినారాయణ, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కూరాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరు శాఖాహారాన్ని భుజించాలని జిల్లా పిఎస్ ఎస్ఎం అధ్యక్షురాలు రాజకుమారి అన్నారు. బుధవారం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మరియు పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో ధ్యానం, శాకాహారం అవగాహనపై ర్యాలీ నిర్వహించడం జరిగింది. తోట్లవల్లూరు ప్రధాన సెంటర్ నుంచి అన్ని వీధులలో ఈ ర్యాలీ నిర్వహించి శాఖాహారం పై ధ్యానంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజకుమారి, పిరమిడ్ సీనియర్ మాస్టర్ స్వర్ణలత, పిరమిడ్ మాస్టర్ జాస్తి సాంబశివరావు, పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ మూడే శివశంకర్, గాంధీ, చంద్రశేఖర్, లక్ష్మీ లు పాల్గొని ధ్యానం యొక్క ప్రాముఖ్యతను శాఖాహారం యొక్క ఉపయోగాలను తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ లోని విద్యార్థులకు ధ్యానం గురించిన శిక్షణ అందించారు. ప్రతి ప్రాణిలోనూ భగవంతుడు ఉన్నాడని అదే అన్ని మతాల సారమని గ్రామంలో కరపత్రాల ద్వారా, ఫ్ల కార్డుల ద్వారా ప్రచారం నిర్వహించారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఆయిల్ పామ్ సాగు రైతుల ఇంట కురిపిస్తుందని వాహన్ కాపీ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఉండవల్లి ఆగ్రోస్ డీజీఎం బి హరికష్ణ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో రైతులకు ఆయిల్ పామ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం వారు అందించే రాయితీలు కంపెనీ వారు అందించే సహాయ సహకారాలు గురించి రైతులకు వివరించారు పామ్ ఆయిల్ అనేది కొత్త పంట అయినందున కంపెనీవారు క్షేత్రస్థాయిలో పర్యటన నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై అలసత్వం వద్దు:

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ పట్టణ ప్రజలకు కావలసిన త్రాగునీరు, శానిటేషన్ విషయంలో ఎటువంటి అలసత్వం వహించకుండా చూడాలని మున్సిపల్ కమీషనర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో శానిటేషన్ పనులు, త్రాగునీటి పైపులైన్ల లీకేజ్ పనులను అసిస్టెంట్ కమీషనర్ పి.శ్రీనివాసరావుతో కలిసి కమిషనర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు అవసరమైన తాగునీరు, శానిటేషన్ పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయం సిబ్బంది ఇంటి, అస్తి పన్నులను త్వరితగతిన ప్రజలతో కట్టించే విధంగా పనిచేయాలన్నారు.

వాగ్దానాల అమల్లో కూటమి విఫలం : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైసిపి అవనిగడ్డ నియోజకవర్గం ఇంచార్జ్ సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. బుధవారం సాయంత్రం వైసీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలో ఉండగా పేద ప్రజల ఇళ్ల నిర్మాణానికి ఇసుక మట్టి తోలుకుంటే గోగోలు పెట్టి అల్లరి చేసిన నాయకులు ఈనాడు అధికారంలోకి వచ్చి విచ్చలవిడిగా ఇసుక మట్టి దోపిడీ చేస్తున్నారని దుయ్యబట్టారు. స్థానిక శాసనసభ్యులు ఎవరు మట్టి ఇసుక జోలికి వెళ్లరాదని బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని పోలీస్ రెవెన్యూ వారు చర్యలు తీసుకోవాలని ఆదేశాలిస్తున్నప్పటికీ కూటమి నాయకులు మాత్రం

యథేచ్ఛగా ఇసుక మట్టి తరలిస్తున్నారని విమర్శించారు. ఎంతో కష్టపడి ఎన్నికల సందర్భంగా అయినప్పటికీ నిధులు మంజూరు చేయించి కోడూరు రహదారి రోడ్ల నిర్మాణం చేపడితే ఆ నిర్మాణాన్ని జరగనివ్వకుండా ఎందుకు ఆపారు చెప్పాలని ప్రశ్నించారు .అదేవిధంగా బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ దానిని కూడా సాగనివ్వలేదని తెలిపారు. అవనిగడ్డలో డంపింగ్ యార్డ్ తరలింపును అడ్డుకున్నారన్నారు. తొలుత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు ఎంపీపీ తుంగల సమితి దేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం నాయకులు కడవకొల్లు నరసింహారావు, నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఘంటసాల జడ్పిటిసి తుమ్మల మురళి, ఆరు మండలాల అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, చింతలమడ నాని, వేమూరి వెంకట్రావు, పరిచే మాధవరావు, నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గ్రామాభివృద్ధి ప్రతి అధికారి కృషి చేయాలని ఎంపీడీవో విజయ సారధి కోరారు. మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాలు బుధవారం గ్రామపంచాయతీల అభివృద్ధిపై మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2025-26 సంవత్సరాలలో గ్రామాల్లో చేయవలసిన అభివద్ధి పనులపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ టు జి గోపాలరావు, మండల పరిషత్ ఏవో మహమ్మద్ ఇమ్రాన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి ,మండల స్థాయి అధికారులు,పంచాయతీ కార్యదర్శులు ఏజేయల్ నరసింహారావు, ఎలీషా రావు, విజయలక్ష్మి, విజయ్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : డిపిఒ

ప్రజాశక్తి-గన్నవరం: అభివృద్ధి చెందుతున్న గన్నవరంలో చెత్త కనిపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిపిఓ జే.అరుణ అధికారుల ఆదేశించారు. బుధవారం గన్నవరంలో ఆమె పర్యటించారు. స్వచ్ఛ గన్నవరం వాహనం పనితీరును చూశారు. అక్కడక్కడ చెత్త కుప్పలు ఉండడాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లపై చెత్త ఉంటే అనేక సమస్యలు వస్తాయని, రెగ్యులర్ గా చెత్త కుప్పలను తొలగించాలని చెప్పారు. చెత్త సేకరణ విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. లక్షల రూపాయలతో స్వచ్ఛ గన్నవరం వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారని, దానిలో చెత్త తరలించడానికి అధికారులు పర్యవేక్షణ ఉండాలన్నారు. అధికారులు విధిగా గ్రామంలో పర్యటించి ఎక్కడ సమస్య ఉందో గుర్తించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటేనే సమస్యలు తెలుస్తాయని ఆ తర్వాత వాటి పరిష్కారానికి

చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని ఆమె ఉద్బోధించారు. పనితీరులో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పంచాయితీ అధికారుల పనితీరులో మార్పు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




చంద్రశేఖర్

సాండ్ పేపర్‌పై నెహ్రూ చిత్రపటం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : బాలల దినోత్సవం, దేశ మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా జరుపుకునే బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రాన్ని జగ్గయ్యపేట పట్నానికి చెందిన అల్లి చంద్రశేఖర్ బ్లాక్ సాండ్ పేపర్ పై ఫ్యాక్టరీ వైట్ పేపర్ పై బాల్ పెన్ తోను నెహ్రూ చిత్రంలో వారికి ఇష్టమైన బాలల బొమ్మలతో నెహ్రూ చిత్రాన్ని గీశారు. ప్లాస్టిక్ పేపర్ పై పెన్సిల్‌తో ఆయన చిత్రాన్ని, పావురం గులాబీ పుష్పాన్ని చిత్రీకరించారు.

దుర్గా ప్రసాద్ ను అభినందిస్తున్న హనిమిరెడ్డి డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు

పవర్ లిఫ్టింగ్‌లో మైలవరం కళాశాల విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థికి అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీలు ఇటీవల విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాలలో జరిగాయని ఈ పోటీల్లో తమ కళాశాలకు చెందిన సిహెచ్.దుర్గాప్రసాద్ మూడు విభాగాలైన బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్, స్క్వాడ్‌లలో కలిపి 585 కేజీలను ఎత్తి బంగారు పథకాన్ని సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. దుర్గాప్రసాదను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మధుమేహంలో హెచ్చుతగ్గుల నివారణకు బాదం దోహదం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మనం తినే ఆహారం ద్వారా సమర్థవంతమైన మధుమేహ నిర్వహణ చేయటం సాధ్యమవుతుంది. అని, బాదం వంటి పోషకమైన ఆహారాలు చేర్చడం వలన చెక్కర స్థాయి తగించు కోవచ్చని ప్రముఖ పోషకాహార నిపుణులు ఎస్.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు బాదంలో రక్తంలోని చక్కెర స్థాయిలను నిర్వహిం చడానికి సహాయపడే ప్రోటీన్, అసంతృప్త కొవ్వులు, డైటరీ ఫైబర్ వంటి 15 ముఖ్యమైన పోషకాలు ఉంటాయి అని తెలిపారు. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో బ్లడ్ షుగర్ నియంత్రణను మెరుగుపరచడానికి, కార్బోహైడ్రేట్ అధికంగా ఉన్న ఆహారంలో బ్లడ్ షుగర్ ప్రభావాన్ని తగ్గించటానికి తోడ్పడుతుందని తెలిపారు. ఈ ప్రపంచ మధుమేహ దినోత్సవం నాడు రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడంలో మొత్తం ఆరోగ్యానికి తోడ్పడేందుకు మన ఆహారంలో బాదం వంటి పోషకాలు కలిగిన ఆహారం చేర్చుకుందామని తెలిపారు.

మధుమేహంపై అవగాహన అవసరం

ప్రజాశక్తితో ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ రాకేష్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రతి సంవత్సరం నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవంగా జరుపుకుంటాము. సాధారణ ప్రజల్లో మధుమేహం గురించి, దానివల్ల కలిగే దీర్ఘకాలిక సమస్యల గురించి అవగాహన కల్పించడం ఈ దినోత్సవ ఉద్దేశం. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ సంస్థ ఒక కొత్త థీమ్‌ను విడుదల చేస్తుంది. ఈ సంవత్సరం థీమ్ డయాబెటిస్ అండ్ వెల్ బీఇంగ్' ఈ సందర్భంగా రమేష్ హాస్పటల్ ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్ రాకేష్ బొబ్బా ప్రజాశక్తితో మాట్లాడారు.

మధుమేహం(షుగర్ వ్యాధి) ఒక హార్మోన్ సమస్య అని, ఇన్సులిన్ అనే హార్మోన్ క్లోమ గ్రంధి నుండి ఉత్పత్తి చేయబడుతుందని తెలిపారు. ఈ ఇన్సులిన్ తగినంత ఉత్పత్తి అవ్వనప్పుడు లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సరిగ్గా పని చేయనప్పుడు రక్తంలో ఉండే గ్లూకోస్ మన శరీరకణాల్లోకి ప్రవేశించలేదు అని తెలిపారు. దాని ఫలితంగా గ్లూకోజ్ ఉండాల్సిన స్థాయి కన్నా ఎక్కువగా ఉండటాన్ని మధుమేహం అంటారని తెలిపారు.

టైప్ - 1 డయాబెటిస్ : డయాబెటిస్ ఉన్నవారికి శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి అవ్వదు. వీరిలో రోగనిరోధక వ్యవస్థ ఇన్సులిన్ తయారు చేసే ప్యాంక్రియాస్‌లోని కణాలపై దాడి చేసి నాశనం చేస్తుందన్నారు. ఇది ఏ వయస్సులోనైనా కనిపిస్తుందన్నారు. ఈ రకం మధుమేహం ఉన్నవారిలో ఇన్సులిన్ ఉత్పత్తి ఉండదని, ప్రతిరోజూ చక్కెర స్థాయిని బట్టి ఇన్సులిన్ తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వారిలో మాత్రలు పని చేయవని తెలిపారు.



టైప్ - 2 డయాబెటిస్ : డయాబెటిస్‌లో మన శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి అవుతుంది కానీ అది మన శరీర అవసరాలకు సరిపడదు కాబట్టి దీనికి చికిత్సగా ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచడం కోసం, ఇన్సులిన్ రెసిస్టెన్స్‌ను తగ్గించే మాత్రలను లేదా ఇన్సులిన్ వాడాల్సి ఉంటుందని తెలిపారు.

గర్భధారణ మధుమేహం : గర్భధారణ సమయంలో కొంతమంది స్త్రీలలో గర్భధారణ మధుమేహం వస్తుందన్నారు. ఈ రకమైన మధుమేహం బిడ్డ పుట్టిన తర్వాత పోతుందన్నారు. గర్భధారణ మధుమేహం ఉంటే టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వీరు మాత్రలు వాడితే బిడ్డపై ప్రభావం చూపుతుందన్నారు. కొంతమందిలో మెట్ఫార్మిన్ వంటి బేసిక్ మాత్రలు వాడవచ్చని తెలిపారు.

ఇలా నయం చేయొచ్చు : కొంతమంది యుక్త వయస్కులలో కొత్తగా వచ్చిన మధుమేహాన్ని మందులు, ఆహారం, శారీరక శ్రమ మానసిక ఒత్తిడిని తగ్గించడం ద్వారా నయం చేయవచ్చని పేర్కొన్నారు. షుగర్ వ్యాధి ఉన్న వారిలో గుండె సమస్యలు వచ్చే అవకాశం రెండు నుంచి మూడు రెట్లు అధికంగా ఉంటుందని వీరిలో చక్కెర స్థాయిలనే కాకుండా బి.పి, కొలెస్ట్రాల్, అధిక బరువును కంట్రోల్ చేయడం ద్వారా గుండె సమస్యలను వాటివల్ల కలిగే మరణాలను కొంతవరకు నివారించవచ్చన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో నెప్పిలేని గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువ.అన్నారు. అందుకే తప్పకుండా క్రమం తప్పకుండా 6 నెలలు లేదా సంవత్సరానికి ఒకసారి ఇసిజి, 2డి ఎకో, సిటి. సిఎజి వంటి పరీక్షలు చేయించుకుంటే మంచిదన్నారు. షుగర్ వ్యాధి ఉన్నవారిలో కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం కూడా చాలా ఎక్కువన్నారు. క్రమం తప్పకుండా కిడ్నీ పరీక్షలను చేయించుకోవాలన్నారు. చూపు మందగించటం, నరాలు దెబ్బతినడం వంటివి జరుగుతాయని, కంటి పరీక్షలు చేయించుకుంటే మంచిదని అన్నారు. సూపర్ స్పెషలిస్ట్ ఎండోక్రైనాలజిస్ట్ చికిత్స చాలా అవసరం అన్నారు.

నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం

ఆహార అలవాట్లు ఇలా ఉండాలి : తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం, అవసరం అన్నారు. మధుమేహం ఉన్నవారు తరచుగా షుగర్ పరీక్షలు చేయించుకోవడం, వంటివి చేయడం ద్వారా మన దేశంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగటాన్ని కొంతవరకు అరికట్టవచ్చున్నారు. దీర్ఘకాలిక సమస్యల నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చని రమేష్ హాస్పిటల్స్ ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ రాకేష్ బొబ్బా సూచించారు.

మారుతి ది డాజ్లింగ్ న్యూ డిజైర్ కారు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వాహనాల తయారీలో దిగ్గజంగా పేరుగాంచిన మారుతి సుజుకి "ది డాజ్లింగ్ న్యూ న్యూ డిజైర్ నూతన కారును రామవరప్పాడు సమీపంలోని డీలర్ వరుణ్ మోటార్స్‌లో స్థానిక ఎం.ఎల్.ఏ గద్దే రామ్మోహన్, ఎస్.బి.ఐ. రీజనల్ మేనేజర్లు సంయుక్తంగా బుధవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన టెక్నాలజీతో వస్తున్న ఆధునిక కార్లను ఆవిష్కరించడం సంతోషకరంగా ఉందని, అభివృద్ధి చెందుతున్న విజయవాడ నగరంలో ఆధునిక టెక్నాలజీపైన ప్రజలు మక్కువ చూపుతారని తెలిపారు. ది డాజ్లింగ్ న్యూ డిజైర్ కారు పెట్రోల్, సిఎన్‌జి వేరియంట్స్‌లో ఉంటాయని, ఎలక్ట్రిక్ సన్ రూఫ్ టాప్, 360 డిగ్రీస్ హెచ్‌డి వ్యూ కెమెరా, 6 ఎయిర్ బ్యాగ్స్, అధిక మైలేజ్ వంటి అధునాతన ఫీచర్స్‌తో ఆధునిక హంగులతో అమర్చబడి ఉన్నాయని, ఎక్స్‌షోరూం ప్రారంభపు ధర రూ.6.79 లక్షల నుండి ఉంటుందని, ఆకర్షణీయమైన రంగులలో, వివిధ వేరియంట్లలో లభ్యమవుతాయని జనరల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో వరుణ్ మోటార్ సిఈఓ గిరిబాబు మారుతిసుజుకి కంపెనీ ప్రతినిధులు, కస్టమర్లు, వినియోగదారులు, ఫైనాన్షియర్స్, తదితరులు పాల్గొన్నారు.

15న 'జీవన మంజూష' పుస్తకావిష్కరణ సభ

విజయవాడ : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నవంబరు 15న శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విజయవాడ బందరురోడ్డులో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నవమల్లెతీగ మాసపత్రిక ఆధ్వర్యంలో మంజు యనమదల రచించిన 'జీవన మంజూష' పుస్తకావిష్కరించనున్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. కృష్ణాజిల్లా పూర్వ కలెక్టర్, రచయిత ఎఎండి ఇంతియాజ్ సభాధ్యక్షత వహించే ఈ సభలో విశిష్ట అతిథులుగా ప్రముఖ కవి, రచయిత డా. యం.ప్రభాకర్, సాహితీ పోషకులు గోళ్ళ నారాయణరావు, సుప్రసిద్ధ నవలా రచయిత సాగర్ శ్రీరామకవచం, ఠాగూర్ గ్రంథాలయాధికారి రమాదేవి తెలిపారు.

రోడ్ల వెంటే చెత్త.. దుర్గంధం

- అలంకార ప్రాయంగా చెత్త నుండి సంపద కేంద్రాలు
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి - కంచికచర్ల : మండలంలో పలు గ్రామాల్లో ప్రధాన రోడ్ల వెంట చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో రోడ్లపై నడవాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తుందని, దుర్వాసనకు అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి రోడ్ల వెంట చెత్తా చెదారం పేరుకుపోయినా ఆయా గ్రామ పంచాయితీల సిబ్బంది పట్టీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కంచికచర్ల మండలం గొట్టముక్కల నుండి కంచికచర్ల వచ్చే ప్రధాన రోడ్డులో ధనలక్ష్మీ కాలనీ వద్ద చెత్తా చెదారం పేరుకుపోయింది. రోజుల తరబడి చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. ప్రతిరోజు వందలాది మంది ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. వాసనకు ముక్కుమూసుకొని ప్రయాణిస్తున్నామని ప్రజలు అంటున్నారు. ఈ రోడ్డు గుండానే వాసనకు ముక్కు మూసుకొని పాలకులు, అధికారులు కూడా ప్రయాణిస్తారు. కానీ వారికి మాత్రం పేరుకుపోయిన చెత్త కనబడదని ప్రజలంటున్నారు. కంచికచర్ల గ్రామ పంచాయితీ పరిధిలో జుజ్జూరు వెళ్లే ప్రధాన రహదారిలో పెట్రోల్ బంకు దాటాక రోడ్డు పక్కనే అర కిలోమీటర్ మేర చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఆంధ్ర - తెలంగాణాను కలిపే అంతర్రాష్ట్ర రహదారిపై ప్రతిరోజు 10 వేల మంది ప్రయాణిస్తుంటారు. ఈ ప్రాంతానికి రాగానే దర్వాసనకు ముక్కుమూసుకుంటున్నారు. ఇక్కడే కుక్కల గుంపుకూడా చేరి వచ్చిపోయే వాహనదారులను వెంబడిస్తున్నాయి. ఈ వాసనకు అంటురోగాలు వస్తాయని జనం ఆందోళన చెందుతున్నారు. 30వేల మంది జనాభా గల మేజర్ పంచాయితీ కంచికచర్లలో రోడ్ల వెంట చెత్తాచెదారం పేరూకుపోయి దర్వాసన వెదజల్లుతున్నా పంచాయితీ పాలకులు కాని సిబ్బంది కాని ఇటువైపు కన్నెత్తి చూడరని ఆ ప్రాంత వాసులు అంటున్నారు. గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఉన్నా అవి పేరుకేనని, వాటి ఆలనా పాలనా పట్టించుకోకపోవటం వల్ల అవి అలంకార ప్రాయంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గ్రామాల్లో రోడ్ల వెంట చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు సకాలంలో పారిశుధ్య కార్యక్రమాలు చేసి, అంటురోగాలు ప్రబలకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.